క్లుప్తంగా

నియామకం..



మధిర మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

మధిర: ఖమ్మం కార్పొరేషన్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న సంపత్‌కుమార్ మధిర మున్సిపల్ కమిషనర్‌గా నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన అహ్మద్ సఫియుల్లా ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. విజయదశమి సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పనితీరుపై కౌన్సిలర్లు మూకుమ్మడిగా ఫిర్యాదు చేశారు. అదేవిధంగా పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా ఉందని చెప్పడంతో పాటు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఖమ్మంకు బదిలీ చేసినట్లు తెలిసింది.

బాధ్యతలు స్వీకరించిన విద్యుత్‌శాఖ అధికారులు



ఏడీఈని అభినందిస్తున్న ఉద్యోగులు

వైరా: విద్యుత్‌శాఖలో ఇటీవల జిల్లా వ్యాప్తంగా అధికారులు బదిలీ అయ్యారు. అందులో భాగంగా బుధవారం పలువురు విద్యుత్‌శాఖ అధికారులు బాధ్యతలు స్వీకరించారు. వారిలో నిర్మల్ నుంచి డీఈ బండి శ్రీనివాసరావు, ఖమ్మం నుంచి ఏడీఈ కిరణ్‌కుమార్, తల్లాడ మండల కుర్నవల్లి నుంచి పి.సుందర్‌కుమార్ ఏఈగా, సబ్‌ఇంజనీర్‌గా ఖమ్మం నుంచి నరేష్ ఇక్కడ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలు సకాలంలో బిల్లులు చెల్లించి విద్యుత్ సమస్యలు ఉంటే పరిష్కరించుకోవాలని సూచించారు.

సింగరేణి ఇంజనీర్‌కు సత్కారం



సింగరేణి ఇంజనీర్ సురేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి జేవీఆర్ ఓసీలో సీహెచ్‌పీ ఇంజనీర్ సురేష్ డీడీ ఎంఎస్‌గా పదోన్నతి పొంది బదిలీ అయిన సందర్భంగా బుధవారం పిట్ సెక్రటరీ నాగేశ్వరరావు బ్రాంచ్ కార్యదర్శి తీగల కాంత్రికుమార్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, ఐఎన్‌టీయూసీ యూనియన్ నాయకులు ఎ.నాగేందర్, బొందు శ్రీనివాస్, ఈ.నగేష్, కల్యాణ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థికి ఐప్యాడ్ బహూకరణ



భగత్‌కు ఐప్యాడ్ అందిస్తున్న దృశ్యం

వైరా: నీటిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన బొంతు భగత్‌కు బుధవారం మెడికల్ ఎడ్యుకేషన్‌కు అవసరమైన ఐప్యాడ్‌ను బోడపట్ల రవీంద్ర, కొంగర సుధాకర్, బేగ్ రోషన్ అందజేశారు. అనంతరం వైద్య విద్యలో ఉన్నతంగా రాణించి పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.

సీఎన్‌జీ ద్విచక్రవాహనం ఆవిష్కరణ



ద్విచక్రవాహనాన్ని ఆవిష్కరిస్తున్న సీఐ కిరణ్

సత్తుపల్లి: సత్తుపల్లిలోని కమల్‌మిత్ర బజాజ్ షోరూంలో బజాజ్ ఫ్రీడమ్ సీఎన్‌జీ ద్విచక్ర వాహనాన్ని సత్తుపల్లి సీఐ టి.కిరణ్ బుధవారం ఆవిష్కరించారు. జిల్లాలోనే తొలిసారిగా ఈ వాహనాన్ని మార్కెట్‌లోకి విడుదల చేసినట్లు షోరూం నిర్వాహకులు ఎండి రహ్మత్‌పాషా తెలిపారు. రెండు కేజీల సీఎన్‌జీ ట్యాంక్, రెండు లీటర్ల పెట్రోల్ ట్యాంక్ ఉంటాయని తెలిపారు. రెండు కేజీల సీఎన్‌జీ(గ్యాస్)తో 220 కిలోమీటర్లు, పెట్రోల్ 2లీటర్లకు గాను 130 కిలోమీటర్లు మైలేజ్ వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ షాకీర్, ఎండీ కమల్‌పాషా, సందీప్‌గౌడ్ పాల్గొన్నారు.

విధుల్లో చేరిన ఉపాధ్యాయులు

సత్తుపల్లి మండలంలో 25 మంది..



సత్తుపల్లిలో విధుల్లో చేరుతున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లి: 2024 డీఎస్సీలో ఉపాధ్యాయులుగా నియమితులైన 25 మంది ఉపాధ్యాయులు బుధవారం సత్తుపల్లిలోని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు సమక్షంలో విధుల్లో చేరారు. సత్తుపల్లి మండలానికి 13 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, 12 మంది స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు విధుల్లోకి చేరినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు నుంచి 42 మంది..



కల్లూరు మండలంలో..

కల్లూరు: మండలంలో 42 మంది నూతన ఉపాధ్యాయులు వివిధ పాఠశాలల్లో బుధవారం చేరారు. స్థానిక ఎంఆర్‌సీలో విద్యాశాఖ అధికారిణి పత్తిపాటి నివేదిత చేతుల మీదుగా జాయినింగ్ ఆర్డర్లు పొందిన ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చేరారు.

మండలంలో 26 మంది..



తల్లాడలో..

తల్లాడ: మండలంలోని పాఠశాలల్లో చేరేందుకు 27 మంది ఉపాధ్యాయులను నియమించగా.. బుధవారం 26మంది పాఠశాలల్లో చేరారు. వీరికి ముందుగా తల్లాడ మండల వనరుల కేంద్రంలో వారికి ఎంఈఓ ఎస్.దామోదరప్రసాద్ నియామక పత్రాలను అందించారు. వీరిలో 21 మంది ఎస్‌జీటీ ఉపాధ్యాయులు, నలుగురు స్కూల్ అసిస్టెంట్లు, పీఈటీలు ఇద్దరి గానూ.. ఒక్కరు మాత్రమే జాయిన్ అయ్యారు.

పెనుబల్లిలో 49మంది..

పెనుబల్లి: డీఎస్సీలో నియమితులైన 49మంది ఉపాధ్యాయులు బుధవారం పెనుబల్లిలో ఎంఈఓ సత్యనారాయణ సమక్షంలో విధుల్లో చేరారు. మండలానికి 42మంది సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, 5గురు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు, ఇద్దరు పీఈటీ ఉపాధ్యాయులు విధుల్లో చేరగా.. వారిని ఎంఈఓ అభినందించారు.

వైరా మండలానికి 9 మంది..



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ వెంకటేశ్వర్లు

వైరా: వైరా మండలానికి 9 మంది ఉపాధ్యాయులను కేటాయించగా.. వారికి బుధవారం ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లు నియమాక పత్రాలను అందజేశారు. మండలానికి 5గురు ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్లుగా, ముగ్గురు ఎస్జీజీలు ఉపాధ్యాయులు, ఒక పీఈటీ విధుల్లో చేరగా.. ఎంఈఓ అభినందించారు.

మండలానికి 25 మంది..



నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ జయరాజు

కారేపల్లి: సింగరేణి మండలానికి 25మంది ఉపాధ్యాయులను కేకెటాయిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేయగా.. బుధవారం జాయినింగ్ ఆర్డర్లను ఎంఈఓ జయరాజు చేతుల మీదుగా అందించారు. స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 4గురు, సెకండ్ గ్రేడ్ టీచర్లు 21 మంది ఆయా పాఠశాలల్లో జాయిన్ అయ్యారు. కార్యక్రమంలో ఆయా ఉపాధ్యాయ సంఘాల నాయకులు మంగీలాల్, వెంకటరెడ్డి, వీర్యానాయక్, మంగీలాల్, దామోదర్, పాపాలాల్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన 63మంది..



ఎర్రుపాలెం: ఎంఈఓకి జాయినింగ్ రిపోర్టును అందజేస్తున్న ఉపాధ్యాయులు

ఎర్రుపాలెం: ఎర్రుపాలెం మండలానికి మొత్తం 68మంది ఉపాధ్యాయులను కేటాయించగా.. బుధవారం 63మంది విధుల్లో చేరారు. ఈ మేరకు జాయినింగ్ రిపోర్టును ఎంఈఓ మురళీమోహన్ రావుకు అందించారు.

బోనకల్‌లో 16మంది..



బోనకల్: ఉపాధ్యాయులకు నియామక పత్రాలు అందజేస్తున్న ఎంఈఓ పుల్లయ్య

బోనకల్: మండలంలోకి నియమించిన 16మంది ఉపాధ్యాయుల్లో.. 11మంది ప్రాథమిక పాఠశాలల్లో, 5గురు ఉన్నత పాఠశాలల్లో విధుల్లో చేరారు. వీరికి స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో ఎంఈఓ దామాల పుల్లయ్య నియామక పత్రాలు అందించి అభినందించారు.

ముదిగొండలో 11మంది..



ముదిగొండలో..

ముదిగొండ: మండలంలో 11మంది ఉపాధ్యాయులు బుధవారం విధుల్లో చేరారు. వీరిలో నలుగురు ఎస్‌జీటీలుగా, ఏడుగురు స్కూల్ అసిస్టెంట్లుగా విధుల్లో చేరగా.. వారికి ఎంఈఓ రమణయ్య నియామక పత్రాలు అందించి అభినందించారు.

పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరి



కాకర్లపల్లిలో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

సత్తుపల్లిరూరల్: పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని పశువసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం కాకర్లపల్లిలో పశువులకు వేస్తున్న టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమం వచ్చేనెల 14వరకు కొనసాగుతుందని, ప్రతీ ఒక్కరూ ఈ అవకాశం వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నా ఉద్యోగం నాకే ఇవ్వాలి



నిరసన తెలుపుతున్న వెంకటలక్ష్మి

మధిర: గత ఐదు సంవత్సరాలుగా పాఠశాలలో స్కావెంజర్‌గా పని చేస్తున్న తనను అకారణంగా తొలగించారని, తన ఉద్యోగం తనకే ఇవ్వాలని కోరుతూ.. ఒక మహిళ బుధవారం స్థానిక మానవ వనరుల కేంద్రం వద్ద నిరసన తెలిపింది. మధిర పట్టణంలోని బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో గద్దల వెంకటలక్ష్మి గత 5 సంవత్సరాలుగా స్కావెంజర్‌గా పనిచేస్తున్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి తనను అకారణంగా తొలగించి వేరే ఒక యువకుడిని స్కావెంజర్‌గా నియమించారని ఆమె తెలిపింది. అంతేకాకుండా గతంలో పనిచేసిన శాలరీ సుమారు రూ.10 వేలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి తన సమస్యను పరిష్కరించాలని కోరారు.

ఘనంగా అయ్యప్ప మాలధారుల ఇరుముడి



ఇరుముడితో శబరిమలైకు బయలు దేరిన అయ్యప్ప మాలధారులు

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం, బాలపేట గ్రామాల్లో బుధవారం అయ్యప్ప మాలధారుల ఇరుముడి కార్యక్రమం ఘనంగా జరిగింది. బాలపేటలో 12మంది, అన్నారుగూడెంలో 12మంది అయ్యప్ప స్వాములు 41 రోజులు కఠిన దీక్ష అనంతరం ఇరుముడి దరించి శబరిమలైకు ప్రత్యేక వాహనాల్లో బయలు దేరారు. ఈ సందర్భంగా గురుస్వాములు పిన్ని కృష్ణయ్య, చిట్టెం నరసింహారావు, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఫిజియోథెరపీ సేవలు వినియోగించుకోవాలి

చింతకాని: పాక్షిక పక్షవాతం, శారీరక అంగవైకల్యం కల్గిన పిల్లల కోసం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని వైద్యురాలు వల్లూరి వసంత అన్నారు. బుధవారం మండలంలోని లచ్చగూడెం ఉన్నత పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించి మాట్లాడారు. పాక్షిక అంగవైకల్యం కల్గిన పిల్లలకు అవసరమైన సహాయ పరికరాలను అందజేయటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ భూక్యా దస్లీ, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, భవిత కేంద్రం సంరక్షకురాలు లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠకు పొంగులేటి విరాళం



కట్టకూరు గ్రామస్తులకు విరాళం అందజేస్తున్న మంత్రి పొంగులేటి

ముదిగొండ: మండలంలోని కట్టకూరులో బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి రూ.20వేలు నగదు గ్రామస్తులకు బుధవారం ఖమ్మం క్యాంపు కార్యాలయంలో అందజేశారు.

పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే..



సభలో మాట్లాడుతున్న పోటు ప్రసాద్

బోనకల్: పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండానే అని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో సీపీఐ సీనియర్ నేత కామ్రేడ్ జక్కా నాగభూషణం ప్రథమ వర్ధంతి సభ బుధవారం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించేది కమ్యూనిస్టులే అన్నారు. పార్టీకోసం చివరివరకు పోరాడిన జక్కా నాగభూషణం చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, రావి శివరామకృష్ణ, యంగల ఆనంద్‌రావు, తూము రోషన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సాగు యాంత్రీకరణతో లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

కల్లూరురూరల్: ఆధునిక వ్యవసాయంలో యాంత్రీకరణ కీలక పాత్ర పోషిస్తోందని, ట్రాక్టర్లు మొదలు చిన్న, సన్నకారు రైతులకు యాంత్రీకరణ అందుబాటులో ఉటుందని వరి పరిశోధన సంస్థ కీటక విభాగం టెక్నికల్ ఆఫీసర్ వెంకయ్య, స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, కల్లూరు వ్యవసాయాధికారిణి ఎం.రూప తెలిపారు. బుధవారం మండలంలోని రావికంపాడులో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, సీఎస్ఆర్ ఫండ్ సహకారంతో భారతీయ వరి పరిశోధన సంస్థ ద్వారా రైతులకు యాంత్రీకరణ ద్వారా వ్యవసాయంలో లాభసాటి విధానాల గురించి వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ మార్పులు, అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు, కూలీల కొరత, సాగు ఖర్చులు పెరిగిపోవటం లాంటి కారణాల వల్ల రైతులు నష్టపోతున్నారన్నారు. దీనిని అధికమించేందుకు నేరుగా వరి విత్తన సాగు చేసినట్లయితే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పొలం తయారీ, విత్తటం, ఎరువులు వేయటం, మందులు పిచికారీ, వరి కోత, డ్రోన్లు అందుబాటులో ఉన్నాయని వీటి ద్వారా ఎకరానికి రూ.8వేల నుంచి రూ.10వేల వరకు ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టి.శ్రీకాంత్, డ్రోన్ ఆపరేటర్ సంతోష్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయం



ఆర్టీసీ డీఎం రాజ్యలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే రాగమయి, దయానంద్

సత్తుపల్లిటౌన్: రాష్ట్రంలోనే సత్తుపల్లి ఆర్టీసీ డిపోను ఉత్తమ డిపోగా తీర్చిదిద్దటంలో కృషి చేసిన ఆర్టీసీ ఉద్యోగుల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ అన్నారు. ఇటీవల సత్తుపల్లి డిపో ఉత్తమ అవార్డు సాధించిన సందర్భంగా డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి బుధవారం ఎమ్మెల్యే రాగమయిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెను ఎమ్మెల్యే సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ ఉన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ



సభ విలీన వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కారేపల్లి: టీయూసీఐలో ఐఎఫ్‌టీయూ విలీన సభను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు దరావత్ సక్రు కోరారు. ఈ సందర్భంగా బుధవారం టేకులగూడెంలో వాల్‌పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 20న హైదరాబాద్‌లో నిర్వహించే సభను కార్మిక సంఘం విజయవంతం చేయాలన్నారు. దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ఓ బలమైన టీయూసీఐ కార్మిక సంఘంగా బలపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్, కార్మిక సంఘ నాయకులు జోగా నాగేశ్వరరావు, కోడెం సీతారాములు, రమేష్, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలంపాట

మధిర: మండలంలో అక్రమంగా పట్టుబడ్డ ఇసుకను బుధవారం తహసీల్‌లో వేలంపాట నిర్వహించారు. వేలంపాటలో పాల్గొన్న రాము రూ. 1.73 లక్షలకు ఇసుకను దక్కించుకున్నాడు.

గ్రామ దీపికలతో సమీక్ష



సమావేశంలో పాల్గొన్న గ్రామ దీపికలు

కల్లూరు: ఉషోదయ మండల మహిళా సమైక్య నందు ఏపీఎం వెంకటరామారావు, సీసీ శ్యామలాదేవి కల్లూరు క్లస్టర్ పరిధిలోని గ్రామ దీపికలతో బుధవారం సమీక్ష నిర్వహించారు. సెర్ప్ కార్యక్రమాలు, బ్యాంక్ లింకేజ్ రుణాలు, మరియు బ్యాంకు ఎన్‌పీఏ రికవరి గురించి ఇందిరా మహిళా శక్తి ఎంటర్‌ప్రైజెస్ కార్యక్రమాల పై సమీక్ష జరిగింది.

పరామర్శ..



వీరమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మువ్వా విజయబాబు

సత్తుపల్లిటౌన్: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు చిత్తలూరి ప్రసాద్ తల్లి వీరమ్మ ఇటీవల మృతి చెందగా ఆ కుటుంబాన్ని బుధవారం టీజీఐడీసీ చైర్మన్ మువ్వా విజయబాబు పరామర్శించారు. సత్తుపల్లిలో వీరమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. అదే విధంగా పలుకుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మట్టా ప్రసాద్, కొత్తూరు కోటేశ్వరరావు, సాగర్ పాల్గొన్నారు.

మోడల్ కళాశాల విద్యార్థుల ఇంటర్న్‌షిప్



ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

కారేపల్లి: తెలంగాణ మోడల్ కళాశాల సీనియర్ ఇంటర్ వృత్తి విద్యా కోర్సు విద్యార్థులకు సమగ్ర శిక్షలో భాగంగా దసరా సెలవుల్లో 10 రోజుల పాటు ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు రెగ్యులర్ కోర్సుతోపాటు, వృత్తి విద్యా కోర్సులను మోడల్ కళాశాలలో అందిస్తున్నామని పేర్కొన్నారు. మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ ట్రేడ్‌లో భాగంగా కారేపల్లిలో షేక్ బాబా ఆధ్వర్యంలో విద్యార్థులు ఫొటో అండ్ వీడియోగ్రఫీలో మెలుకువలను తెలుసుకున్నారు. అదే విధంగా అగ్రికల్చర్ ట్రేడ్‌లో భాగంగా కారేపల్లిలోని శ్రీబాలాజీ అగ్రిమాల్, ఫెర్టిలైజర్ దుకాణంలో నరేష్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలు వృత్తివిద్యా కోర్సు అధ్యాపకులు నిషా జుబిన్, సుధాకర్‌ల పర్యవేక్షణలో జరిగాయి.

శిథిలావస్థలో.. వ్యవసాయాధికారి కార్యాలయం

- ప్రమాదకరంగా మెట్లు
- ఆరు బయటే విధులు
- ఇబ్బందులు పడుతున్న అధికారులు, రైతులు



శిథిలావస్థకు చేరిన వ్యవసాయశాఖ కార్యాలయం

బోనకల్: మండల కేంద్రంలోని వ్యవసాయాధికారి కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. 2010లో రూ.3 లక్షల వ్యయంతో నిర్మించిన కార్యాలయం అనతికాలంలోనే పగుళ్లు ఏర్పడి కూలడానికి సిద్ధంగా ఉంది. పై అంతస్తుకు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మెట్లు సైడ్‌వాల్ లేకపోవడం, మెట్లు చువ్వలు బయటకు వచ్చి ప్రమాదభరితంగా ఉన్నాయి. గతంలో నిర్మించిన కాంట్రాక్టర్ నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం వల్ల తక్కువ కాలంలోనే శిథిలావస్థకు చేరిందని మండల రైతులు ఆరోపిస్తున్నారు.

ఆరు బయటే పనులు..

వ్యవసాయాధికారులు భవనం కూలుతుందేమోనని కొంతకాలం ఆరుబయట చెట్లకింద విధులు నిర్వర్తించారు. నూతన భవనం కోసం పలుమార్లు ఉన్నతాధికారులకు నివేదికలు పంపించినప్పటికీ ఫలితం లేకపోవడంతో చేసేదేమి లేక తప్పనిసరి పరిస్థితుల్లో రైతు వేదికను వ్యవసాయ కార్యాలయంగా ఉపయోగిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వ్యవసాయశాఖ కార్యాలయాన్ని నిధులు మంజూరు చేయాలని రైతులు, వ్యవసాయాధికారులు కోరుతున్నారు.



వంగిపోయిన మెట్లు

నూతన భవనం నిర్మించాలి..



కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో మండల వ్యవసాయాధికారి కార్యాలయం అనతికాలంలోనే శిథిలావస్థకు చేరుకుంది. నల్లరేగడి నేలలో భవనం నిర్మించడంతో కుంగిపోయి పగుళ్లు ఏర్పడ్డాయి. భవనంపై స్టేర్‌కు వెళ్లాలంటే ఎప్పుడు కూలుతుందేమోనని భయం వేస్తుంది. నూతన భవనానికి నిధులు మంజూరు చేయాలి.

– మోర్ల నరసింహారావు, రైతు, బోనకల్